క్లుప్తంగా

రోడ్డుపై వ్యర్థాల తొలగింపు



సాక్షి ఎఫెక్ట్

మధురానగర్(విజయవాడ సెంట్రల్): ఎట్టకేలకు నగర పాలకసంస్థ అధికారులు స్పందించారు. మధురానగర్ వీవీనరసరాజు రోడ్డు, అంబేడ్కర్ కాలనీ తదితర ప్రాంతాల్లో వాటర్ పైపు లైన్ పనుల్లో భాగంగా తవ్విన గోతులను పూడ్చివేశారు. అలాగే వాటర్ లీకేజీలను సరిచేయడంతో పాటు, మధురానగర్‌లో రోడ్డుపై వదలివేసిన రోడ్డు వ్యర్థాలను తొలగించారు. ఇక్కడ వాటర్ పైపులైన్ పనుల కోసం రోడ్డును తవ్వి సక్రమంగా పూడ్చలేదు. అలాగే వాటర్ పైపులైన్ పనుల్లో భాగంగా లీకేజీలు వస్తున్నాయి. ఈ విషయాలను వివరిస్తూ సాక్షి శుక్రవారం 'నత్తనడకన వాటర్ పైపులైన్ పనులు' శీర్షికన కథనం ప్రచురించింది. దీనిపై స్పందించిన అధికారులు గోతులను పూడ్చి, లీకేజీలను సరిచేశారు.

24 నుంచి భారతీ తీర్థ మహాస్వామి జన్మదిన వేడుకలు



విజయవాడ కల్చరల్: శృంగేరీ జగద్గురువులు భారతీ తీర్థ మహాస్వామి 75వ జన్మదిన వేడుకల సందర్భంగా ఈ నెల 24 నుంచి ఏప్రిల్ 8వ తేది వరకు 75 రోజుల పాటు శివరామకృష్ణ క్షేత్రంలో విశిష్ట కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ధర్మాధికారి శిష్టా హనుమత్ ప్రసాద్ తెలిపారు. రామకోటిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నిత్యం నవచండీ హోమం, చండీ పారాయణం పూర్ణాహుతి నిర్వహిస్తునట్లు తెలిపారు. అనంతరం బ్రోచర్‌ను ఆవిష్కరించారు. జొన్నవిత్తుల ప్రభాకర శాస్త్రి, గండూరి చంద్రమౌళీ పాల్గొన్నారు.

అంకమ్మతల్లి శక్తిపీఠంలో అన్నప్రసాద వితరణ



మధురానగర్(విజయవాడసెంట్రల్): మధురానగర్ నేతాజీకాలనీ శ్రీ అంకమ్మతల్లి శక్తిపీఠం వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా శనివారం భారీ అన్నప్రసాద వితరణ జరిగింది. సుమారు ఐదు వేల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రసాదం స్వీకరించారు. తొలుత పీఠం వ్యవస్థాపకుడు అన్నాబత్తుల శరాబందీరావు అమ్మవారికి ప్రత్యేక పూజలు, అర్చనలు చేశారు. కార్యక్రమంలో గజ్జలకొండ వాసు తదితరులు పాల్గొన్నారు.

200 మందికి అన్నప్రసాద వితరణ

విజయవాడ కల్చరల్: తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో పున్నమ్మతోటలోని టీటీడీ కల్యాణ మండపంలో శనివారం 200 మంది భక్తులకు అన్నప్రసాదం అందించారు. తొలుత ప్రాంగణంలో వేంచేసి ఉన్న భూదేవీ, శ్రీదేవి సమేత వెంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ఇన్‌స్పెక్టర్ లలితా రమాదేవి మాట్లాడుతూ అన్నప్రసాద వితరణకు సహాయం అందించేవారు దేవాలయ ప్రాంగణంలోని కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. శ్రీవారి పూజలకు వినియోగించిన పూలతో తయారైన అగర్‌బత్తి, సోప్‌లను కార్యాలయ ఉద్యోగులు విక్రయించారు. అన్నప్రసాద వితరణ కార్యక్రమంలో సూరపనేని శ్రీ చౌదరి, బిల్లా అమృత్ సూర్యకేదారేష్, శ్రీనివాసరావు, గంగాభవానీ పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం



లబ్బీపేట(విజయవాడతూర్పు): మన పరిసరాలను మనమే పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా పలు అనారోగ్యాలకు దూరంగా ఉండవచ్చునని 24వ డివిజన్ కార్పొరేటర్ కుక్కల అనిత పేర్కొన్నారు. శనివారం ఆమె డివిజన్‌లో చేపట్టిన స్వచ్ఛ భారత్, స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో పాల్గొని రోడ్లను శుభ్రం చేశారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ బాలాజీ, కుక్కల రమేష్ పాల్గొన్నారు.

మధురానగర్(విజయవాడసెంట్రల్): అయోధ్యనగర్‌లో శనివారం స్వచ్ఛ ఆంధ్ర దివస్ కార్యక్రమంలో భాగంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్పొరేటర్ చన్నగిరి రామ్మోహన్‌రావు, వార్డు సచివాలయ సిబ్బంది, నాయకులు వెంకటేశ్వరరావు, శేషు తదితరులు పాల్గొన్నారు. అలాగే మారుతీనగర్‌లో స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో కార్పొరేటర్ వల్లభనేని రాజేశ్వరి ముఖ్య అతిథిగా పాల్గొని వార్డు సచివాలయం, పారిశుద్ధ్య సిబ్బందితో కలిసి పరిసరాలు శుభ్రం చేశారు.

డంపింగ్ కేంద్రాలుగా ఖాళీ స్థలాలు

- ఇళ్ల మధ్యనే చెత్త కుప్పలు
- పట్టించుకోని వీఎంసీ అధికారులు



ఇందిరానాయక్ నగర్ పోస్టు మ్యాన్ రామచంద్రయ్య వీధిలో పేరుకుపోయిన చెత్త

పూర్ణానందంపేట(విజయవాడపశ్చిమ): సింగ్‌నగర్ ఇందిరానాయక్ నగర్‌లో ఉన్న ఖాళీస్థలాలు డంపింగ్ కేంద్రాలుగా మారాయి. పదుల సంఖ్యలో ఖాళీగా ఉన్న ప్లాట్లు చెత్త, చెదారంతో నిండి దుర్గంధం వెదజల్లుతున్నాయి. నివాసాల మధ్య ఉన్న ఈ స్థలాల్లో చెత్త కుప్పలు పేరుకుపోతుండటంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని స్థానికులు చెబుతున్నారు.

పేరుకుపోతున్న చెత్త కుప్పలు

పారిశుద్ధ్య సిబ్బంది ఇళ్ల నుంచి నిత్యం సేకరించే వ్యర్థాలు, రోడ్లపై ఊడ్చిన చెత్తను తిరిగి ఇళ్ల మధ్యనే పడేస్తున్నారని స్థానిక మహిళలు వాపోతున్నారు. దీంతో తీవ్ర దుర్గంధం వెదజల్లడమే కాకుండా తమ ఇళ్లల్లోని పిల్లలు, వృద్ధులు తరచూ అనారోగ్య పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇందిరానాయక్ నగర్‌లో ఏ ఇంటి పక్కన చూసిన ఖాళీస్థలాల్లో పేరుకుపోయిన చెత్త కుప్పల డంపింగ్‌లే దర్శనమిస్తున్నాయి. నగరపాలక సంస్థ అధికారులు ఇంటి పన్ను, నీటి పన్నుల రూపంలో తమ నుంచి వేలాది రూపాయలు వసూళ్లు చేసే విషయంలో చూపే శ్రద్ధ తమ ఇళ్ల చుట్టూ ఉన్న సమస్యను తొలగించడంలో చూపకపోవడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

దోమలు, విషపురుగులకు ఆవాసాలు

కాలనీలో ఉన్న ఖాళీస్థలాల్లో మురుగు నీరు చేరి దోమలకు నిలయంగా మారుతున్నాయి. దీంతో రాత్రి, పగలు కంటి మీద కునుకు లేకుండా పోతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనికి తోడు బుడమేరు ప్రాంతం నుంచి వస్తున్న విషపురుగులు ఇక్కడ ఉన్న ఖాళీస్థలాల్లో పెరిగిన పిచ్చి మొక్కల మధ్య చేరి భయాందోళనకు గురిచేస్తున్నాయి. బయట ఆడుకునే తమ పిల్లలకు ఎప్పుడు ఏమి జరుగుతుందోనని కాలనీవాసులు ఆందోళన చెందుతున్నారు.

కనిపించని స్వచ్ఛ ఆంధ్ర

ఒక పక్క స్వచ్ఛ భారత్ – స్వచ్ఛ ఆంధ్ర అంటూ ఊదరగొడుతున్న అధికారులు ఇక్కడ నెలకొన్న పరిస్థితితులను పట్టించుకోకపోవడంపై స్థానికులు మండిపడుతున్నారు. నెలల తరబడి చెత్త, మురుగు నీరు పేరుకుపోతున్నా.. అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం పట్ల వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

నిర్లక్ష్యంగా స్థల యజమానులు

ఖాళీగా ఉన్న స్థలాల్లో పిచ్చి మొక్కలు పెరిగిపోతున్నా వాటి యజమానులు పట్టించుకోకపోవడం, మూడు, నాలుగు నెలలకు ఒకసారి వచ్చి తమ స్థలాలను చూసుకుని వెళ్లడం తప్ప వాటిని శుభ్రం చేయడం లేదని స్థానికులు పేర్కొంటున్నారు. కనీసం మెరక కూడా చేయడం లేదు. మురుగునీరు చేరి చుట్టు పక్కల ఉన్నవారు అనారోగ్యం బారిన పడుతున్నారంటున్నారు. ఖాళీస్థల యజమానులకు నోటీసులు ఇచ్చి వారిని హెచ్చరించాల్సి వీఎంసీ అధికారులు సైతం తమకు పట్టనట్లు వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.





ఖాళీస్థలాల్లో పెరిగిన పిచ్చి మొక్కలు

ఎటు చూసినా చెత్త కుప్పలే

కాలనీలో ఎక్కడ చూసిన చెత్తకుప్పలే కనిపిస్తున్నాయి. పారిశుద్ధ్య సిబ్బంది ఎక్కడెక్కడో సేకరించిన చెత్తను మొత్తం ఇళ్ల మధ్యనే పడేస్తున్నారు. దీంతో తీవ్ర దుర్గంధం వస్తుంది. భరించలేక పోతున్నాం.

– జయప్రద, ఇందిరానాయక్ నగర్

విషపురుగులతో భయాందోళన

ఖాళీస్థలాల్లో చేరుతున్న దోమలు, విషపురుగులు రోజురోజుకు పెరిగిపోతున్నాయి. రాత్రులు కంటి మీద కునుకు లేకుండాపోతోంది. మరోపక్క ఇళ్లల్లోకి వస్తున్న విషపురుగులతో భయాందోళన చెందుతున్నాం.

– పద్మ, ఇందిరానాయక్ నగర్

నగర పరిశుభ్రత అందరి బాధ్యత

మేయర్ రాయన భాగ్యలక్ష్మి



స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో ప్రతిజ్ఞ చేయిస్తున్న మేయర్ భాగ్యలక్ష్మి

భవానీపురం(విజయవాడపశ్చిమ): ఇంటిని శుభ్రంగా ఉంచుకున్నట్లే నగరాన్ని కూడా పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి అన్నారు. నగర పరిధిలోని 64 వార్డులలో నగరపాలక సంస్థ ఇన్‌చార్జ్ కమిషనర్ డాక్టర్ డి.చంద్రశేఖర్ ఆధ్వర్యంలో శనివారం స్వచ్ఛ ఆంధ్ర – స్వచ్ఛ దివస్ కార్యక్రమాలు జరిగాయి. పశ్చిమ నియోజకవర్గం పరిధిలోని భీమనవారి పేటలో జరిగిన కార్యక్రమంలో మేయర్ భాగ్యలక్ష్మి, సెంట్రల్‌లో స్థానిక ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు, తూర్పు నియోజకవర్గ పరిధిలోగల మారుతీ కో ఆపరేటివ్ కాలనీలో ఎమ్మెల్యే గద్దె రామమోహనరావు పాల్గొని ఆయా ప్రాంతాల్లోని ప్రదేశాలను శుభ్రపరిచారు. ఈ సందర్భంగా మేయర్ భాగ్యలక్ష్మి మాట్లాడుతూ వ్యర్థాలను కేవలం మున్సిపల్ కార్పొరేషన్ ఇచ్చిన డస్ట్ బిన్స్‌లో మాత్రమే వేసి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని కోరారు. సంపూర్ణ ఆరోగ్యం కోసం పరిశుభ్రతను దైనందిన కార్యక్రమాల్లో ఒక అంశంగా పెట్టుకోవాలని సూచించారు. విజయవాడను స్వచ్ఛ నగరంగా తీర్చిదిద్దాలని చెప్పారు. ఇన్‌చార్జ్ కమిషనర్ డాక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ నగరంలోని 286 సచివాలయాల పరిధుల్లో నిత్యం వ్యర్థాలు పేరుకుపోయే ప్రదేశాలను శుభ్రం చేసి వాటిని అందంగా తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. డ్రెయిన్లలోని వ్యర్థాలను తొలగించి పూడిక తీసి మురుగునీటి ప్రవాహం సక్రమంగా జరిగేలా చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సబ్ కలెక్టర్, ఆర్డీఓ చైతన్య కుమార్, కార్పొరేటర్ దేవినేని అపర్ణ, జోనల్ కమిషనర్ ప్రభుదాస్, ప్రాజెక్ట్ ఆఫీసర్ వెంకటనారాయణ, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ బాబు శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఎన్టీ రామారావుకు ఘన నివాళి



పాయకాపురం(విజయవాడరూరల్): టీడీపీ వ్యవస్థాపకుడు, మాజీ ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు వర్ధంతి కార్యక్రమం శనివారం పైపులరోడ్డు సెంటర్‌లో జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన ఎన్టీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను వివరించారు. టీడీపీ నాయకులు గొట్టుముక్కల రఘురామరాజు, దాసరి కనకారావు పాల్గొన్నారు. అలాగే 62, 63వ డివిజన్లల్లో జరిగిన ఎన్టీఆర్ వర్ధంతి కార్యక్రమాల్లో ఎమ్మెల్యే, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

మధురానగర్(విజయవాడసెంట్రల్): స్థానిక 26వ డివిజన్ మాచవరంలో శనివారం డివిజన్ ఇన్‌ఛార్జి వల్లభనేని సతీష్ ఆధ్వర్యాన దివంగత ముఖ్యమంత్రి ఎన్టీఆర్ వర్ధంతి కార్యక్రమం జరిగింది. ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు ముఖ్య అతిథిగా పాల్గొని ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అలాగే 29వ డివిజన్ మధురానగర్‌లో ఎన్టీఆర్ వర్ధంతి పురస్కరించుకుని పేదలకు పండ్లు పంపిణీ చేశారు. 30వ డివిజన్‌లో ఎన్టీఆర్ వర్ధంతి పురస్కరించుకుని పేదలకు అన్నదానం చేశారు. ఆయా కార్యక్రమాల్లో స్థానిక కార్పొరేటర్లు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వానికి వలంటీర్ల ఉసురు తగులుతుంది

సాక్షి, అమరావతి: కూటమి ప్రభుత్వానికి వలంటీర్ల ఉసురు తప్పక తగులుతుందని ఏపీ స్టేట్ వలంటీర్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు గుజ్జుల ఈశ్వరయ్య ధ్వజమెత్తారు. విజయవాడలోని సీపీఐ రాష్ట్ర కార్యాలయం దాసరి భవన్‌లో శనివారం ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. అక్రమ అరెస్టులు, నిర్బంధాలతో చంద్రబాబు ప్రభుత్వం రాజ్యాంగ హక్కులను కాలరాస్తోందన్నారు. గ్రామ వలంటీర్లను దారుణంగా మోసం చేస్తున్న కూటమి ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించక తప్పదన్నారు. హామీ అమలు చేయాలని ప్రభుత్వానికి తమ గోడు వెళ్లబోసుకునేందుకు వలంటీర్లు ప్రయత్నిస్తే ఈ నెల 16న వారిని అరెస్టులుచేసి 151నోటీసులు ఇచ్చి రాజద్రోహం కేసులు పెడతామని బెదిరించడం దుర్మార్గమన్నారు. వలంటీర్లకు ఉద్యోగ భద్రత కల్పింస్తామని, రూ.10 వేల వేతనం ఇస్తామని చెప్పిన చంద్రబాబు మోసం చేస్తే ఆయనకు పవన్, లోకేష్ తానా తందానా అని వంత పాడటం సరికాదన్నారు. వలంటీర్లను తిరిగి విధుల్లోకి తీసుకుని రూ.10 వేలు వేతనం ఇస్తానని చంద్రబాబు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లంక గోవిందరాజులు, కార్యదర్శి జి.మమత పాల్గొన్నారు.

నేటి నుంచి ఉచిత యోగా శిక్షణ

మధురానగర్(విజయవాడసెంట్రల్): శ్రీ వేంకటేశ్వర యోగా సేవా కేంద్రం ఆధ్వర్యాన ఆదివారం నుంచి 28 రోజులపాటు ప్రభుత్వ ముద్రణాలయం సమీపం లో టీచర్స్‌కాలనీ మూడో లైన్‌లోని అజయ్‌హైస్కూల్‌లో ఉచిత యోగా శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు ప్రధాన యోగాచార్యులు డాక్టర్ వేంకటేశ్వర యోగి గురూజీ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నేటి బిజీ జీవితంలో యోగా చేయడం అత్యంత అవసరమన్నారు. ఎనిమిది నుంచి 80 సంవత్సరాల వయస్సు వరకు కుల మత బేధం లేకుండా యోగా శిక్షణలో పాల్గొనవచ్చని పేర్కొన్నారు.

ఠాగూర్ గ్రంథాలయానికి పుస్తకాలు బహూకరణ



దాత అందించిన పుస్తకాలను చూస్తున్న గ్రంథాలయ సిబ్బంది, పాఠకులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): గ్రంథాలయ పితామహుడు అయ్యంకి వెంకటరమణయ్య వారసుడు సరస్వతి సామ్రాజ్య ట్రస్ట్ అధ్యక్షుడు అయ్యంకి మురళీకృష్ణ ఠాగూర్ స్మారక గ్రంథాలయానికి పుస్తకాలను బహూకరించారు. శనివారం గ్రంథాలయాధికారి కె. రమాదేవికి రూ. 8వేల విలువైన పుస్తకాలను అందజేశారు. విద్యార్థుల కోసం నీతి కథలు, పాఠకులకు కొమ్మూరి చంద్రశేఖర్, యండమూరి వీరేంద్రనాథ్ నవలలు గ్రంథాలయానికి బహూకరించారు. దాత అయ్యంకి మురళీకృష్ణను గ్రంథాలయ అధికారి రమాదేవి, సిబ్బంది ప్రత్యేకంగా అభినందించారు.

దాసాంజనేయునికి సిందూర పూజలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): స్వయంభూ మాచవరం శ్రీదాసాంజనేయస్వామివారి దేవాలయంలో శనివారం ఆలయ అర్చకులు స్వామివారికి ప్రీతికరమైన సిందూరం, ఆకు పూజలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారికి ప్రీతికరమైన రోజు కావడంతో పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు.

• ఫోజులిచ్చారు... వెళ్లిపోయారు..



చీపుర్లు చేత పట్టి ఫొటోలకు ఫోజులిస్తున్న ఎంపీ కేశినేని, ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్, కలెక్టర్ లక్ష్మీశ తదితరులు



సార్లు వెళ్లాక ఎక్కడి చెత్త అక్కడే ఉండగా శుభ్రం చేస్తున్న కార్మికులు

ఎన్టీఆర్ జిల్లా గొల్లపూడి పంచాయతీలో శనివారం స్వచ్ఛాంధ్ర – స్వచ్ఛ దివస్ కార్యక్రమం నిర్వహించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొని చెత్తను తొలగించి పరిశుభ్రతను మెరుగుపరచాలని పిలుపునిచ్చారు. ప్రజలతో ప్రతిజ్ఞలు చేయించారు. ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్, పలువురు టీడీపీ నాయకులతోపాటు కలెక్టర్ జి.లక్ష్మీశ తదితరులు ఇదిగో ఇలా ఫొటోలకు ఫోజులిచ్చారు. అంతే ఎక్కడ చెత్త అక్కడ వదిలేసి సార్లు కార్లు ఎక్కేసి వెళ్లిపోయారు. ఆ తర్వాత మా పని మాకు తప్పదు కదా అన్నట్టు పారిశుద్ధ్య కార్మికులు వారి పనిలో వారు మునిగిపోయారు.

– కిషోర్, సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

నగరంలో నటి మీనాక్షి చౌదరి సందడి



షోరూంలో ఆభరణాలు ప్రదర్శిస్తున్న మీనాక్షి చౌదరి

లబ్బీపేట(విజయవాడతూర్పు): నగరంలో సినీనటి మీనాక్షి చౌదరి శనివారం సందడి చేశారు. మహాత్మా గాంధీరోడ్డులో ఏర్పాటు చేసిన ఎమ్మడి సిల్వర్ జ్యూవెలరీ షోరూమ్ ప్రారంభోత్సవంలో ఆమె పాల్గొని ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ సందర్భంగా షోరూమ్‌లో ఆకట్టుకునే డిజైన్‌లతో ఉన్న వెండి ఆభరణాలను చూసి ముగ్ధురాలైంది. అత్యున్నత ప్రమాణాలతో రూపుదిద్దుకున్న ఆభరణాలు ఇప్పుడు విజయవాడలో అందుబాటులోకి రావడం సంతోషకరమన్నారు. ఆమె చూసేందుకు అభిమానులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో షోరూమ్ సీఈఓ ఎమ్మడి సునీత, మేనేజింగ్ డైరెక్టర్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య నిర్వహణలో ప్రభుత్వం ఘోర వైఫల్యం

వైఎస్సార్ సీపీ సెంట్రల్ నియోజకవర్గ సమన్వయకర్త మల్లాది విష్ణు



మధురానగర్(విజయవాడసెంట్రల్): పారిశుద్ధ్య నిర్వహణలో కూటమి ప్రభుత్వం ఘోరంగా వైఫల్యం చెందిందని వైఎస్సార్ సీపీ సెంట్రల్ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు శనివారం ఒక ప్రకటనలో విమర్శించారు. ఇంటింటికీ బుట్టలను ఇచ్చి చెత్తను సేకరించాలన్నది లక్ష్యమని.. కానీ క్లాప్ ఆటోలు రాకపోవడంతో ట్రాలీలతో చెత్త సేకరణ సరిగా సాగడం లేదన్నారు. తడి చెత్త, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించడం పూర్తిగా నిలిచిపోయిందన్నారు. చెత్త సేకరణ సజావుగా సాగుతున్న ఒక్క ప్రాంతాన్ని అయినా నగరంలో చూపగలరా..? అని ప్రశ్నించారు. సర్కిల్-2 పరిధిలో రోజుకు దాదాపు 200 టన్నుల చెత్త బయటకు వస్తుందని.. ఆ చెత్తను తరలించే సమయంలో పరిస్థితి మరింత దయనీయంగా ఉంటోందని పేర్కొన్నారు.

గత ప్రభుత్వంలో జాతీయస్థాయి అవార్డులు

మరోవైపు కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న 'స్వర్ణ ఆంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర' గత ప్రభుత్వం అమలు చేసిన క్లీన్ ఆంధ్రప్రదేశ్(క్లాప్) కార్యక్రమానికి పూర్తి కాపీ వర్షెన్ అని మల్లాది విష్ణు ఎద్దేవా చేశారు. పరిసరాల పరిశుభ్రత విషయంలో దేశవ్యాప్తంగా అనేక రాష్ట్రాల్లో అధ్యయనం తర్వాత ఒక సమగ్రమైన విధానాన్ని రూపొందించి.. క్లీన్ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమానికి తాము శ్రీకారం చుట్టామని గుర్తుచేశారు. చంద్రబాబు చెబుతున్న ఇంటింటి నుంచి 100% చెత్త సేకరణ, తడి చెత్త, పొడి చెత్త వేరు చేయడం, తిరిగి ఉపయోగించగల వ్యర్థాలను రీసైక్లింగ్ చేయడం ఇవన్నీ గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అమలు చేసినవేనని చెప్పారు. గత ప్రభుత్వంలో క్లాప్ కార్యక్రమం ఎంతగానో విజయవంతమైందని.. విజయవాడ నగరానికి జాతీయ స్థాయిలో అనేక అవార్డులు సైతం వచ్చినట్లు పేర్కొన్నారు. అటువంటి కార్యక్రమాన్ని గత ఏడు నెలలుగా కూటమి ప్రభుత్వం నీరుగార్చిందని విమర్శించారు. చెత్త తరలించే వాహనాలు నిలిచిపోవడంతో నివాసాల మధ్య ఎక్కడికక్కడ పెద్దఎత్తున చెత్త పేరుకుపోయిందన్నారు. ముఖ్యంగా కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల్లోని నగరాలు, పట్టణాల్లో పరిస్థితి దయనీయంగా మారిందని.. వీధుల్లో ఎక్కడికక్కడ చెత్తకుప్పలు దర్శనమిస్తున్నాయన్నారు. ఫలితంగా గత ఏడు నెలల్లో పదుల సంఖ్యలో ప్రజలు డయేరియా బారిన పడి మృత్యువాత పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికీ చాలా చోట్ల ప్రజలు జ్వరం, జలుబు, దగ్గుతో బాధపడుతూ ఆస్పత్రుల చుట్టూ తిరుగుతున్నట్లు మల్లాది విష్ణు తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం మొక్కుబడిగా నెలకోరోజు మూడో శనివారంలా కాకుండా.. పరిసరాల పరిశుభ్రతకు శాశ్వత పరిష్కారం చూపాలని ఆయన డిమాండ్ చేశారు.

బహిరంగ ప్రదేశాల్లో వ్యర్థాలు వేస్తే కఠిన చర్యలు

- తక్షణమే జీవీపీలను తొలగించాలి
- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ



గొల్లపూడి డంపింగ్ యార్డ్‌లోని వ్యర్థాలను తొలగిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ, అధికారులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): బహిరంగ ప్రదేశాలు, రోడ్ల వెంట వ్యర్థ పదార్థాలను వేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీ శ అధికారులను ఆదేశించారు. స్వచ్ఛ ఆంధ్ర – స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా శనివారం ఆయన విజయవాడ రూరల్ మండలం గొల్లపూడి – జక్కంపూడి రోడ్‌లోని అనధికార గార్బేజ్ వనరబుల్ పాయింట్స్(జీవీపీ)లను పరిశీలించారు. ప్రస్తుతం ఉన్న గార్బేజ్ వనరబుల్ పాయింట్స్‌ను తక్షణమే తొలగించాలని, ఆయా ప్రాంతాల్లో సీసీ కెమేరాలతో పాటు సిబ్బందితో నిఘా ఏర్పాటు చేయాలన్నారు. వ్యర్థాలు వేసే వారిని గుర్తించి జరిమానాలు విధించాలని చెప్పారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీ శ మాట్లాడుతూ.. పచ్చదనం – పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యతనిచ్చి జిల్లాను కాలుష్య రహితంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. గ్రామ పంచాయతీ అధికారులు జీవీపీలపై ప్రత్యేక దృష్టి సారించి వారం రోజుల్లోపు వాటిని తొలగించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. నిర్దేశించిన ప్రాంతాల్లో మాత్రమే వ్యర్థాలను వేయాలని హోటల్ యజమానులు, వ్యాపారస్తులకు నోటీసులు జారీ చేయాలని పంచాయతీ అధికారులను ఆదేశించారు.

80 టన్నుల వర్మి కంపోస్ట్ తయారు..

జిల్లాలో ప్రస్తుతం సంపద తయారీ కేంద్రాల నుంచి 50 నుంచి 80 టన్నుల వర్మి కంపోస్ట్ తయారవుతుందని కలెక్టర్ చెప్పారు. క్లీనింగ్ డ్రైవ్‌ల ద్వారా శిథిలాల తొలగింపు, మూసుకుపోయిన కాలువలు, డ్రెయిన్లలో పూడిక తీయడం, కమ్యూనిటీ, పబ్లిక్ టాయిలెట్స్‌ను శానిటైజ్ చేయాలన్నారు. ఈ సందర్భంగా గొల్లపూడి – జక్కంపూడి రోడ్‌లోని డంపింగ్ యార్డ్‌లో ఆయన మొక్కలను నాటారు. కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి లావణ్య కుమారి, డీపీఓ జీఎస్ఎల్ రాఘవన్, డీఆర్‌డీఏ పీడీ కె.శ్రీనివాసరావు, రూరల్ తహసీల్దార్ బి.సుగుణ, ఎంపీడీఓ బి.విగ్గిన్స్, పంచాయతీ సెక్రటరీ ఎం.స్వరూపరాణి, ప్రత్యేక అధికారి ఎం.ప్రసాద్, స్థానిక నాయకులు బొమ్మసాని సుబ్బారావు, జంపాల సీతారామయ్య తదితరులు పాల్గొన్నారు.

తుర్లపాటి పాత్రికేయ జీవితం సదాస్మరణీయం



జేఎస్‌టీ సాయికి తుర్లపాటి కుటుంబరావు స్మారక పురస్కారం అందజేస్తున్న నిర్వాహకులు

విజయవాడ కల్చరల్: సీనియర్ పాత్రికేయుడు తుర్లపాటి కుటుంబరావు పాత్రికేయ జీవితం సదా స్మరణీయమని పారిశ్రామికవేత్త అంబటి మధుమోహనకృష్ణ అన్నారు. తెలుగు కళావాహిని, శ్రీకళాభారతి, కృష్ణ కళాభారతి, కామ్రేడ్ జీఆర్‌కే పోలవరపు సాహితీ సమితి ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని కౌతా పూర్ణానందం కళావేదికపై శనివారం తుర్లపాటి కుటుంబరావు వర్ధంతి, సినీ సంగీత విభావరి, సామాజిక కార్యకర్త జేఎస్‌టీ సాయికి తుర్లపాటి స్మారక పురస్కార కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న అంబటి మధుమోహనకృష్ణ మాట్లాడుతూ తుర్లపాటి పాత్రికేయ జీవితాన్ని యువ జర్నలిస్టులు ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. కృష్ణాజిల్లా రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి డాక్టర్ జీవీ పూర్ణచందు, ఆంధ్రప్రదేశ్ ఎడిటర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వీవీఆర్ కృష్ణంరాజు తుర్లపాటి పాత్రికేయ జీవిత విశేషాలను వివరించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు, తుర్లపాటి కుటుంబరావు కుమారుడు జవహర్, తెలుగు కళావాహిని అధ్యక్షుడు చింతకాయల చిట్టిబాబు, విద్యావేత్త శేషబాబు, విశ్రాంత పోలీస్ అధికారి కే డేవిడ్‌రాజు పాల్గొన్నారు. సామాజిక కార్యకర్త జేఎస్‌టీ సాయికి తుర్లపాటి కుటుంబరావు స్మారక పురస్కారం ప్రదానం చేశారు. గాయనీ గాయకులు పలు తెలుగు, హిందీ చిత్రగీతాలను ఆలపించారు.

వేడుకగా త్యాగరాజస్వామి శోభాయాత్ర



నగర సంకీర్తన, శోభాయాత్ర నిర్వహిస్తున్న సంగీత విద్వాంసులు

విజయవాడ కల్చరల్: సంగీత సన్మండలి ఆధ్వర్యంలో దుర్గాపురంలోని ఘంటసాల వెంకటేశ్వరరావు ప్రభుత్వ సంగీత నృత్య కళాశాలలో నిర్వహిస్తున్న సంగీతోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. శనివారం త్యాగరాజ స్వామి పుణ్యతిథి సందర్భంగా సంగీత విద్వాంసులు త్యాగరాజస్వామి, ఆంజనేయస్వామి విగ్రహాల శోభాయాత్ర, నగర సంకీర్తన నిర్వహించారు. సంగీత కళాశాలలో మేళతాళాలతో ప్రారంభమైన యాత్ర బీఆర్‌టీఎస్ రోడ్డు, శివాలయం వీధి, గిరివీధి, మారుతీ వ్యాయామశాల మీదుగా తిరిగి సంగీత కళాశాలకు చేరుకుంది. సంగీత విద్వాంసులు మోదుమూడి సుధాకర్, అంజనా సుధాకర్, శశిధర్, పారుపల్లి సుబ్బరాయ ఫల్గుణ్, కల్యాణరామన్, బీవీ విద్యాసాగర్, మల్లాది కార్తీక, త్రివేణి, లక్ష్మీనరసమ్మతోపాటు పలువురు విద్వాంసులు యాత్రలో పాల్గొని త్యాగరాజ కీర్తనలను ఆలపించారు. సంగీత కార్యక్రమంలో భాగంగా బీవీఎస్ఎస్ త్రివేణి, సర్వజ్ఞ సువిధ, పెద్దిబొట్ల శైలజతో పాటు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన విద్వాంసులు త్యాగరాజ కృతులను ఆలపించారు.

నేడు పంచరత్న కృతుల గోష్ఠిగానం

కాగా ఆదివారం ఉదయం తొమ్మిది గంటలకు త్యాగరాజస్వామి రచించిన పంచరత్న కృతుల గోష్ఠిగానం నిర్వహించనున్నట్లు సన్మండలి అధ్యక్షుడు మోదుమూడి సుధాకర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో రెండు వందల మంది విద్వాంసులు పాల్గొంటారని ఆయన పేర్కొన్నారు.